## క్లుప్తంగా

### ముత్యాలమ్మకు వెండి వస్తువుల వితరణ



వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం తిరుపతికి చెందిన రాజేంద్రన్, ఆదిలక్ష్మి, కుటుంబ సభ్యులు వెండి కళ్లు, వెండి నుదిటిబొట్టు, ఇత్తడి శూలాన్ని వితరణ చేశారు. వీటిని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణ ప్రముఖులు మొగరాల గణేష్, గిరిగౌడ్, బాలాగౌడ్, ధనంజయులు, సునీల్ పాల్గొన్నారు.

### బస్సును ఢీకొన్న లారీ



పగిలిన బస్సు అద్దాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పదవమైలు గ్రామం వద్ద కేటీరోడ్డుపై తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న తమిళనాడు బస్సును చెన్నై నుంచి తిరుపతి వైపు వస్తున్న లారీ ఢీకొంది. బస్సులోని ఇద్దరు ప్రయాణికులు, లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో పేద కుటుంబానికి ఆదివారం యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఎస్టీ కాలనీకి చెందిన చెంగమ్మకు అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ 60 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ ప్రతినిధులు అరుణ, నాగమణి, వెంకటేష్, హేమ తదితరులు పాల్గొన్నారు.

### హిందీ ప్రచార సభ పరీక్షలు

పిచ్చాటూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరిగింది. ఈ పరీక్షలకు 50 మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల హిందీ పండిట్ మల్లీశ్వరి తెలిపారు. పరీక్షలు ఏటా ఫిబ్రవరి, సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు దక్షిణ భారత హిందీ ప్రచార సభ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తుందన్నారు.

### దెబ్బతిన్న వరి పంట



కాటూరులో నేలకొరిగిన వరిపంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శుక్రవారం, శనివారం కురిసిన భారీ వర్షాలకు వరి పంట దెబ్బతింది. కాటూరు, పల్లమాల, చిన్నయిగుంట, కనమనంబేడు, గ్రామాల్లోని సుమారు 60 ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

### ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు

వెదురుకుప్పం: స్వర్ణముఖి నది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు అన్నారు. వివరాలు.. మండలంలోని పచ్చికాపల్లం జంక్షన్ వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇదే సమయంలో తిరుపతి జిల్లా దుర్గసముద్రం గ్రామానికి చెందిన కార్తీక్(25), దేవకుమార్ (29) ట్రాక్టర్లలో రామచంద్రాపురం మండల సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# పార్టీలో కష్టపడేవారికి పదవులు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



తలపా దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పార్టీలో క్రియాశీలకంగా పనిచేసేవారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన తలపా దామోదర్‌రెడ్డి అభినందన సభ ఆదివారం శ్రీకాళహస్తిలోని శరవణ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్వసనీయతకు, నమ్మకానికి, నిజాయితీకి ప్రాధాన్యం ఇస్తానని.. అలాంటి వారు ఎక్కడ ఉన్నా పిలిచి పదవులు ఇస్తానని తెలిపారు. నియోజకవర్గంలో అనేక మంది బీసీలకు సముచిత స్థానం కల్పించామని తెలిపారు. సిపాయి సుబ్రహ్మణ్యం నిజాయితీకి మెచ్చి ఎమ్మెల్సీ కావడానికి అన్ని విధాలుగా సహకరించామన్నారు. అదే విధంగా మార్కెట్ యార్డు చైర్మన్‌గా మధురెడ్డి, తాజాగా దామోదర్‌రెడ్డికి అవకాశం కల్పించామన్నారు.

**ప్రజాసేవకే అంకితం**

ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తాను, తన కుటుంబ సభ్యులు ప్రజా సేవకే అంకితమయ్యామని తెలిపారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు భరోసా కల్పించామన్నారు. అందుకే ప్రజలు ఏ సమస్య ఉన్నా తన కార్యాలయానికి వస్తున్నారన్నారు. తనపై వారికి అంత నమ్మకం ఏర్పడిందన్నారు. సేవ చేయడానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. 447 మందికి విద్యా దానం చేసినట్లు తెలిపారు. తన కుమార్తె పవిత్రారెడ్డి 160మందిని దత్తత తీసుకుని వారికి బాగోగులు చూస్తోందని చెప్పారు. ముస్లింలు పెళ్లి చేసుకుంటే బీరువా, మంచం, టీవీ తదితర సమాన్లు ఇస్తున్నామని తెలిపారు. పేదవారు మరణిస్తే రూ.10వేలు ఇచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్నామన్నారు. బొజ్జల కుటుంబం ఇక్కడ సంపాదించిన డబ్బుతో హైదరాబాద్‌లో ఆస్తులు కూడబెట్టారన్నారు. తాను బెంగళూరులో సంపాదించి శ్రీకాళహస్తి ప్రజలకు సాయం చేస్తున్నానని తెలిపారు. నిబద్ధతతో పని చేసే వారికి తప్పకుండా ఉన్నత పదవులు దక్కుతాయన్నారు. పార్టీ వెన్నుపోటు దారులకు తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు.

**ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం**

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. మధన్న ఎంతో నమ్మకంతో తనకు, దమోదర్ రెడ్డి, మధురెడ్డికి అవకాశాలు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తెలిపారు. 30 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వన్నెకుల క్షత్రియులకు పదవులు వచ్చాయన్నారు. మధన్న గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. తలపా దామోదర్‌రెడ్డితో పాటు వన్నెకుల క్షత్రియ నాయకులు వెంకటరెడ్డి, రత్నంరెడ్డి, కిట్టు మేస్త్రీ, బుజ్జిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో గుమ్మడి బాలకృష్ణయ్య, పగడాల రాజు, లోకేష్‌యాదవ్, జయగోపాల్, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ సిరాజ్, ముత్యాల పార్థసారథి, సుమతి, ప్రమీలమ్మ, కంఠా ఉదయ్, ఫజల్, చంద్ర, చుక్కల కిరణ్, నాని, జయరామ్‌యాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# చట్టం అందరికీ సమానమే

**చట్టం అందరికీ సమానమేనని మరోసారి రుజువైంది. చంద్రబాబునాయుడు అధికారాన్ని అడ్డు పెట్టుకుని అనేక స్కాములకు పాల్పడినా వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తప్పించుకుంటూ వచ్చారు. ఎల్లప్పుడూ అలా జరగదు. తప్పు చేసిన వారు తప్పించుకోలేరని తేలిపోయింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో బాబు అరెస్టే ఇందుకు నిదర్శనమని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. –సత్యవేడు/కేవీబీపురం**

**టైమ్ ఒకేలా ఉండదు**



చంద్రబాబు తాను ఎంతో అనుభవమున్న నాయకుడని ఇన్నాళ్లూ జనాన్ని తన జిమ్మిక్కులతో నమ్మించగలిగారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో ఆయన్ను మించిన వారు లేదు. ఎన్ని కేసులు, విచారణలు వచ్చినా స్టేలు పొంది కాలం గడిపారు. కానీ స్కిల్ కేసులో పక్కా ఆధారాలతో ఆయన అడ్డంగా దొరికిపోవడంతో కోర్టు రిమాండ్‌కు పంపింది. న్యాయ వ్యవస్థపై జనంలో నమ్మకం పెరిగింది.
–కె.చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి,

**చంద్రబాబు నైతికత కోల్పోయారు**



భావితరాలకు, యువతకు శిక్షణ ఇస్తామని పెట్టిన సంస్థ ద్వారా కోట్లు వెనకేసుకున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో కొనసాగే నైతికత కోల్పోయారు. ఆయన ఇచ్చిన హామీల లాగే ఆయన చేసిన పనులు సైతం సక్రమం కాదని ప్రజలు ఇకనైనా గమనించాలి. టీడీపీ శ్రేణులు సైతం తమ మద్దతు ఎవరికనేది పునరాలోచించుకోవాలి. చట్టానికి ఎవరూ చుట్టాలు కాదని చంద్రబాబు కేసులో జనానికి తేటతెల్లమైంది.
–గవర్ల కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

## శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ గురుమూర్తి

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఎంపీ సంతోష్ కుమార్, ఎంపీ చింతా అనూరాధ, ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులు, సినీ దర్శకుడు రాఘవేంద్రరావు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

## ఆటో బోల్తా: విద్యార్థి మృతి

పుత్తూరు రూరల్ : మండలంలోని మహాలక్ష్మీపురం వద్ద ఆటో బోల్తాపడిన ప్రమాదంలో శ్రీధర్ అలియాస్ గోకుల్ (13) మృతిచెందాడు. ఎస్‌ఆర్‌పురం మండలం బసివిరెడ్డిపల్లెకు చెందిన మునిరత్నం కుమారుడు శ్రీధర్ 7వ తరగతి చదువుతున్నాడు. అప్పలాయగుంటలో జరిగిన మామ పెళ్లికి హాజరై తన తాత మురుగయ్య ఆటోలో తిరుగుప్రయాణమయ్యాడు. పుత్తూరు బైపాస్‌రోడ్డులో వెళుతుండగా మహాలక్ష్మీపురం వద్ద ఆటో బోల్తాపడడంతో శ్రీధర్ ఛాతికి, వెన్నుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీధర్ మృతిచెందాడు. శ్రీధర్ తల్లిదండ్రులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన అందరినీ కలచివేసింది. ఆటోలో ప్రయాణించిన అమ్ములు, వెంకటమ్మకు చేతివేళ్లకు గాయలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ దస్తగిరి కథనం మేరకు వివరాలిలా...కొల్లాగుంటకు చెందిన రాజ(51) అదే గ్రామానికి చెందిన తమ సమీప బంధువు చంద్రతో కలసి ద్విచక్ర వాహనంపై సొంత సిమెంట్ బ్రిగ్స్ ఫ్యాక్టరీ వద్దకు బయలుదేరాడు. కొల్లాగుంట సమీపంలో చిత్తూరు వైపు వెళుతున్న కారు అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతోపాటు వాహనం నడుపుతున్న రాజాను సుమారు వంద అడుగుల దూరం వరకు లాక్కెళ్లింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే రాజా మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చంద్రను పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. ఇదే సమయంలో ఎదురుగా ద్విచక్రవాహనంలో వస్తున్న బెంగళూరుకు చెందిన భరత్‌కుమార్‌ను కూడా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవర్ నగరి మండలం సోమనాథపురానికి చెందిన శేఖర్ కుమారుడు హరిగా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు భార్య మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, రాజాకు ఐదుగురు ఆడ పిల్లలు, ఒక్కరికి మాత్రమే వివాహం చేశాడు.

# ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి పంచాయతీ కుర్రవకన్నేరి గ్రామంలో ఆదివారం సీతారాముల స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, గుడ్లూరు మయూర్, చింత రాజేంద్ర, రత్నశేఖర్, ఆనంద్, మనోజ్ మురళి, జీవీ నాయుడు, సురేష్, వెంకట్, కృష్ణ తదితరులు ఉన్నారు.

## మొదలైన చవితి సందడి

బుచ్చినాయుడుకండ్రిగ: వినాయక చవితి సందడి మొదలైంది. సెప్టెంబరు 18 నుంచి చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుచ్చినాయుడుకండ్రిగలో వివిధ ఆకృతుల్లో బొజ్జ గణపయ్యలను విక్రయాలకు సిద్ధం చేశారు. పలుచోట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కమల గణనాథుడు, సర్ప గణనాథుడు, శ్రీకృష్ణ రూపం, నెమలి, రాజహంస, సింహాసన, గజరాజు, నంది, శంకు, మూషికం, శివస్వరూప ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. విగ్రహాల సైజును బట్టి రూ.100 నుంచి రూ. 30 వేల వరకు ధరలు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.



విగ్రహాల కొనుగోలుకు ఉత్సవ నిర్వాహకులు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. మట్టి విగ్రహాల కొనుగోలుకు జనం ఆసక్తి చూపుతున్నారు.

# ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ స్థలం నుంచి తొలగించిన లారీలు



ఆక్రమణ స్థలంలో తొలగించిన కంచె

సత్యవేడు: మండల కేంద్రంలోని తెలుగు గంగ కాలువ సమీపంలో అంబేడ్కర్ భవనం, వ్యవసాయ గిడ్డంగికి కేటాయించిన స్థలంలో ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. 2019లో అప్పటి ప్రభుత్వం అంబేడ్కర్ భవనానికి 60 సెంట్లు, వ్యవసాయ గిడ్డంగికి 50 సెంట్లు కేటాయించి భవన నిర్మాణాలకు రూ.కోటి మంజూరు చేసింది. ఆ స్థలం తనదేనంటూ సత్యవేడుకు చెందిన టీడీపీ నేత వి.మస్తాన్ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. కొద్ది రోజుల క్రితం హైకోర్టు డిస్మిస్ చేసి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆ స్థలంలో ఆక్రమదారుడు ఉంచిన లారీలు, ట్రాక్టర్లు, కంచె తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా ప్రభుత్వ స్థలంలో ఉంచిన లారీలను దూరంగా తరలించారు. ఆ స్థలంలో ఉంచిన ఇతర వాహనాలను మరో ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. స్థలం చుట్టూ వేసిన కంచెను, ముళ్ల పొదలను జేసీబీల ద్వారా తొలగిస్తున్నారు. స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు అంబేడ్కర్ భవనం నిర్మించేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు దళిత సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల వైద్యానికి కార్పొరేట్ వసతులు



చిన్న పాండూరులో నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- ఎమ్మెల్యే ఆదిమూలం
- చిన్న పాండూరులో ఆస్పత్రి భవనం పరిశీలన
- త్వరలో మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

వరదయ్యపాళెం: పేదల ఆరోగ్యానికి కార్పొరేట్ వసతులు సమకూర్చిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం సాయంత్రం చిన్న పాండూరులో రూ. 1.87కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆస్పత్రి భవనాన్ని త్వరలోనే మంత్రి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన ప్రజలకు చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వసతులతో భవనాన్ని నిర్మించామన్నారు. నాడు–నేడు ద్వారా విద్య, వైద్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత ఇచ్చిందన్నారు. త్వరలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దకే వచ్చి రోగాలను గుర్తించి వైద్యం చేసే సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుందన్నారు. ఎమ్మెల్యే వెంట జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సచివాలయ కన్వీనర్ మాధవయ్య, ఉపసర్పంచ్ మహేంద్ర, నాయకులు సుబ్రమణ్యం, రుద్రయ్య, సురేష్, మురళీ నాయుడు, సర్పంచ్ దుద్దు వేణు ఉన్నారు.



అరుదూరు పుష్కర కుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే

**కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే**

మండలంలోని అరుదూరు గ్రామంలో వెలసిన శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆలయ పుష్కర కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేద పండితులు దుర్గాప్రసాద్ శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు భక్తవత్సలరెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, డైరెక్టర్ సునీల్, గురవయ్య, శేఖర్ యాదవ్ ఉన్నారు.

# సిపాయి భరోసా అందజేత



బందారుపల్లిలో సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన మునస్వామిరెడ్డి(50), బందారుపల్లి గ్రామానికి చెందిన చెన్నంపల్లి మునెమ్మ(59) ఇటీవల మృతి చెందారు. ఆదివారం తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆయా గ్రామాలకు వెళ్లి ఒక్కో కుటుంబానికి ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు బాబు, రాము, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, పార్టీ నాయకులు మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, చంద్రారెడ్డి, దాము, బాలాజీ, మురళి, కిరణ్, వంశీ పాల్గొన్నారు.

**వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ**

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో కుంభాభిషేక పూజల్లో భాగంగా వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయంలో హోమం, విగ్రహ శుద్ధి, అభిషేకాలు, విశేషాలంకరణతో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు చెంబేటి మునిరత్నంరెడ్డి, రామారావు, రవి, రామిరెడ్డి, వెంకటమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినాయకస్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

**ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పూజలు**

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆలయంలో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు విరాళాలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ గ్రామానికి వెళ్లి ఆలయంలో పూజలు నిర్వహించారు.

## వేడుకగా కామాక్షి అమ్మవారి ఉత్సవర్ల కుంభాభిషేకం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరంలో వెలసిన కామాక్షి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేడుకగా కామాక్షి అమ్మ ఉత్సవర్లకు మహా కుంభాభిషేకం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, రెండో కాలయాగ సాల పూజ నిర్వహించారు. తదుపరి అమ్మవారికి పట్వార్చన, ప్రాణ ప్రతిష్ఠ నామకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణంగా తీసుకొని వచ్చి స్నపన తిరుమంజనం చేశారు. ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ప్రోద్బలంతో ఈ క్రతువులు అప్రతిహతంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమాన్ని ఈవో మమత పర్యవేక్షించారు.



అమ్మవారి ఊరేగింపులో ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, రిత్వికులు

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుచానూరుకు చెందిన శివనాట్య కళానిలయం, నాట్య గురువు సంధ్య ఆధ్వర్యంలో కళాకారులు యువదర్శిని, మహాలక్ష్మి, తన, మోక్ష, నిఖిత, స్ఫూర్తి, చాందిని, చార్వి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారిని ఏవో ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

